సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 16 । జులై । 2023



రూ.50,767 విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో నిత్యాన్నదానానికి ఆదినారాయణ, సత్యవతి దంపతులు (పాదలాడ) శనివారం రూ.50,767 విరాళం సమర్పించారు.



రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

ఏలూరు పోలీసు రేంజి పరిధిలో రౌడీషీటర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ మేరకు డీఐజీ అశోక్ కుమార్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. - 8లో

డెల్టాలకు 10,200 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టాలకు శనివారం 10,200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు 3,600, సెంట్రల్ 2,600, పశ్చిమ డెల్టాకు 4 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద గోదావరి నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

శ్రీనివాసా... శ్రీవేంకటేశా



వాడపల్లి ఆలయం బయట భక్తుల కోలాహలం

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 36 వేల మంది భక్తులు వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. స్వామివారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మత్స్యావతారంలో స్వామివారికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవచనం తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు. వివిధ సేవల ద్వారా రూ.22,00,222 ఆదాయం సమకూరిందని ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణ రాజు తెలిపారు.

కిటకిటలాడిన బాలాజీ స్వామి ఆలయం



దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న రామకృష్ణ

మామిడికుదురు: అప్పనపల్లిలోని శ్రీబాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శని త్రయోదశి కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. పవిత్ర వైనతేయ గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించి స్వామివారికి తలనీలాలు, ముడుపులు, మొక్కుబడులు సమర్పించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. ఉభయ దేవేరులతో కొలువు దీరిన శ్రీబాల బాలాజీ స్వామిని దర్శించుకుని తన్మయత్వం పొందారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2.49 లక్షల ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ జి.మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ తెలిపారు. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయాలతో రూ.1.69 లక్షల ఆదాయం సమకూరిందన్నారు. నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.79,251 విరాళాలుగా వచ్చాయని చెప్పారు. అల్లవరం మండలం దేవరపల్లికి చెందిన మారుమాకుల మౌనిక కుటుంబ సభ్యులు నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.17,501 విరాళంగా సమర్పించారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదం అందించారు. 3,369 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకోగా, 2,984 మంది అన్న ప్రసాదం స్వీకరించారు.

రత్నగిరిపై భక్తుల రద్దీ



సత్యదేవుని వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు

అన్నవరం: వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రత్నగిరి శనివారం కిటకిటలాడింది. సత్యదేవుని ఆలయ ప్రాంగణం, వ్రత మండపాలు, క్యూలు భక్తులతో నిండిపోయాయి. స్వామివారిని దర్శించిన అనంతరం భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, పూజలు, ప్రదక్షిణలు చేశారు. వ్రతాలు 1,500 జరిగాయి. సుమారు 25 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.30 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు 5 వేల మంది భక్తులకు నిత్యాన్నదాన పథకంలో భోజనం పెట్టారు.

రమణీయహారం

- మగువల మనసు దోచే వన్ గ్రామ్ గోల్డ్
- బంగారంతో పోటీ పడుతున్న ఆభరణాలు
- కోనసీమలో పెరుగుతున్న విక్రయాలు
- నెలకు రూ.ఐదు కోట్ల వరకూ వ్యాపారం




సాక్షి, అమలాపురం: అందం.. మగువల సొంతం. 'ఆమె' సోయగానికి మరింత వన్నె తెచ్చేదే ఆభరణం. అలాంటి వనితల కోసం మది దోచే వన్ గ్రామ్ గోల్డ్ (ఒక గ్రాము బంగారం) ఆభరణాలు మార్కెట్‌ను ముంచెత్తుతున్నాయి. ఎప్పటికప్పుడు లేటెస్ట్ డిజైన్‌లు వస్తుండటంతో కొనుగోళ్లు గణనీయంగా పెరుగుతున్నాయి. చిన్న చిన్న చెవి పోగుల నుంచి పెద్ద వడ్డాణాల వరకూ.. ముక్కుపుడక నుంచి రాళ్లతో ధగధగలాడే నెక్లెస్‌ల వరకూ.. చేతి గాజుల నుంచి అర వంకీల వరకూ.. ఇలా చెప్పుకొంటూ పోతే మగువలు మనసు దోచే ప్రతి ఆభరణం ఇప్పుడు వన్ గ్రామ్ గోల్డ్‌లో లభ్యమవుతోంది.

'డబ్బులు ఊరికే రావు'.. బంగారు ఆభరణాల గురించి గడచిన ఐదేళ్లుగా అత్యంత ప్రజాదరణ పొందిన యాడ్. అలా అని బంగారం కొనాలంటే అంత పెద్దఎత్తున డబ్బులు కూడా ఊరికే రావు. చిన్న ఉంగరం, చెవి పోగు వంటివి కొనాలంటే రూ.వేలల్లోనూ.. నెక్లెస్, వడ్డాణం వంటి ఆభరణాలకు రూ.లక్షల్లో వెచ్చించాల్సి వస్తోంది. దీనివల్ల మధ్య తరగతి, సామాన్య ప్రజలు, పేదలు బంగారం కొనాలంటే తాహతకు మించి ఖర్చు చేయాలి. అలాగని బంగారు ఆభరణాలపై వ్యామోహాన్ని వదులుకోలేరు. వివిధ శుభ కార్యక్రమాలకు ఆభరణాలు ధరించి వెళ్లడం స్టేటస్‌గా భావిస్తారు. ఇటువంటి వారి బంగారు ఆభరణాల అవసరాలను ఇప్పుడు వన్ గ్రామ్ గోల్డ్ తీరుస్తుంది. దీంతో ఫంక్షన్‌లకు వెళ్లేందుకు బంగారు ఆభరణాలు లేవనే బాధ తప్పుతోంది. దొంగలు దోచుకుపోతారనే భయమూ ఉండడం లేదు.

ధర భలే.. బాగుందిలే

మార్కెట్‌లో వన్ గ్రామ్ గోల్డ్‌తో తయారు చేసిన వివిధ రకాల ఆభరణాలు అతి తక్కువ ధర నుంచే దొరుకుతున్నాయి. సీజెడ్ క్వాలిటీ ఆభరణాలు 24 క్యారెట్ ఆభరణాలను తలపిస్తున్నాయి. రెండూ పక్కపక్కన పెడితే ఏది అసలు బంగారమనేది చెప్పలేని పరిస్థితి. ఈ రకం వన్ గ్రామ్‌గోల్డ్ ధరలు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో హారాల ధరలు రూ.రెండు వేల నుంచి రూ.ఐదు వేల వరకూ పలుకుతుండగా, గొలుసు రూ.400 నుంచి రూ.వెయ్యి, చెవి దుద్దులు రూ.300 నుంచి రూ.1,500, వడ్డాణం రూ.2 వేల నుంచి రూ.8 వేలు, అరవంకీ రూ.300 నుంచి రూ.800, గాజులు రూ.500 నుంచి రూ.మూడు వేల వరకూ పలుకుతున్నాయి. కాసులపేరు రూ.1,200 నుంచి రూ.4 వేలు, వివాహిత మహిళలు పసుపు తాడుకు బదులు ధరించే మంగళ సూత్రాల తాడు (బొందు) రూ.300 నుంచి రూ.500, నల్లపూసల తాడు రూ.200 నుంచి రూ.500 వరకూ ధరల్లో లభ్యమవుతున్నాయి. మహిళలకే కాదు... పురుషులకూ చేతి రింగులు, బ్రాస్‌లెట్‌లు, చైన్‌లు కూడా దొరుకుతున్నాయి. బ్రాస్‌లెట్ ధర రూ.400 నుంచి రూ.1,200 వరకూ ఉంటోంది.



ముచ్చటగొలిపే గాజులు

పల్లెలకు పాకుతూ..

వన్ గ్రామ్ గోల్డ్ వ్యాపారం కోనసీమ జిల్లాలో మారుమూల పల్లెలకు సైతం విస్తరిస్తోంది. అమలాపురం, మండపేట, రామచంద్రపురం మున్సిపాలిటీలతో పాటు మండల కేంద్రాలు, పెద్ద పంచాయతీల్లో సైతం వీటి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. రెండేళ్లుగా వ్యాపారం రెట్టింపు అయ్యిందంటే డిమాండ్ అర్థం చేసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా నెలకు సుమారు రూ.5 కోట్ల వ్యాపారం జరుగుతోందని అంచనా. ఈ ఆభరణాలను దొంగలు దోచేస్తారనో.. ఎక్కడైనా జారవిడుచుకుంటుమనో భయం కూడా లేకపోవడంతో అమ్మకాలు జోరందుకుంటున్నాయి.

సండే స్పెషల్



అసలైన బంగారంలా..



వన్ గ్రామ్ గోల్డ్ హారం

సరికొత్త డిజైన్లలో..



ప్రస్తుతం వన్ గ్రామ్ గోల్డ్ వ్యాపారం బాగా పెరిగింది. చుట్టుపక్కల పల్లెల నుంచి అనేక మంది వచ్చి వీటిని కొనుగోలు చేస్తున్నారు. ఇప్పుడు బంగారు ఆభరణాల కన్నా వన్ గ్రామ్ ఆభరణాలే ఎక్కువ అమ్ముడుపోతున్నాయి. ఇవి సరికొత్త డిజైన్‌లలో దొరుకుతుండడంతో ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు.

– నూదా లక్ష్మీనారాయణ, వ్యాపారి, గొల్లవిల్లి, ఉప్పలగుప్తం మండలం



సరికొత్త నమూనాలో వడ్డాణం



వన్ గ్రామ్ గోల్డ్ నెక్లెస్

హార్టికల్చర్ యూనివర్సిటీలో వైఎస్సార్ విగ్రహం



వుడయార్ శిల్పశాలలో వైఎస్సార్ విగ్రహాన్ని పరిశీలిస్తున్న ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ

కొత్తపేట: పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలం వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీలో నెలకొల్పనున్న దివంగత మాజీ సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి కాంస్య విగ్రహం కొత్తపేట వుడయార్ శిల్పశాలలో రూపుదిద్దుకుంటోంది. అనేక యూనివర్సిటీల్లో ఏర్పాటు చేసిన వైఎస్సార్ విగ్రహాలు స్టాండింగ్ విగ్రహాలు కాగా, ఈ యూనివర్సిటీకి మాత్రం యోగ ముద్రలో ఉన్న వైఎస్సార్ విగ్రహాన్ని రూపొందించాలని ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర దేవదాయ శాఖా మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రముఖ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్‌కు సూచించారు. ఆ మేరకు ముందుగా విగ్రహం నమూనాను రూపొందించగా శనివారం ఉప ముఖ్యమంత్రి సత్యనారాయణ శిల్పశాలకు వచ్చి పరిశీలించారు. ఈ సందర్భంగా శిల్పికి పలు సూచనలు చేశారు. ఏడున్నర అడుగుల ఎత్తులో విగ్రహాన్ని రూపొందించాలని తెలిపారు. విగ్రహాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. మంత్రి వెంట మాజీ ఎంపీపీ ఎం.సంపత్, దేవదాయశాఖ సలహాదారు కె.రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకుడు కె.ధర్మరాజు ఉన్నారు.

ఈవీఎం కంట్రోల్, బ్యాలెట్ యూనిట్ల తరలింపు

కాకినాడ సిటీ: ఎన్నికల సంఘం, కలెక్టర్ ఆదేశాల మేరకు కాకినాడ ఈవీఎం గోదాము నుంచి 50 కంట్రోల్, 50 బ్యాలెట్ యూనిట్లను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు శనివారం తరలించారు. వీటిని రాజకీయ పార్టీ ప్రతినిధుల సమక్షంలో పరిశీలించి, పోలీసు భద్రత నడుమ తరలించామని ఆర్డీఓ ఎన్‌వీవీ సత్యనారాయణ తెలిపారు.

శనైశ్చరా శరణు.. శరణు

- భక్తులతో పోటెత్తిన మందపల్లి క్షేత్రం
- దేవస్థానానికి రూ.26.80 లక్షల ఆదాయం

కొత్తపేట: శనైశ్చరా శరణు.. శరణు అంటూ ఆ స్వామిని భక్తులు కొలిచారు. శని త్రయోదశి పర్వదినం సందర్భంగా కొత్తపేట మండలం మందపల్లి ఉమామందేశ్వర (శనైశ్చర) క్షేత్రానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. జాతకంలో శని మహాదశ, అష్టమ శని, అర్ధాష్టమ శని నడుస్తున్న జాతకులు ఈ రోజు శనైశ్చరునికి పూజలు, తైలాభిషేకం చేస్తే శనిదోషం తొలగిపోతుందని భక్తుల నమ్మకం. దీంతో ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రం కిటకిటలాడింది. శుక్రవారం రాత్రి నుంచి మందపల్లికి భక్తుల రాక ప్రారంభమైంది. తెల్లవారే సరికి క్రమేపీ పెరిగింది. ఆలయ ప్రాంగణం, వెలుపల, వెనుక పూజల ప్రాంగణంలో అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తైలాభిషేకాలు చేశారు. శనైశ్చర క్షేత్రాన్ని సుమారు 30 వేల మంది దర్శించుకున్నారు. శనైశ్చర స్వామివారిని పోలవరం, మండపేట ఎమ్మెల్యేలు తెల్లం బాలరాజు, వేగుళ్ల జోగేశ్వరరావు, శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు, స్థానిక డీఎస్పీ కేవీ రమణ, వివిధ జిల్లాల రెవెన్యూ, పోలీస్ శాఖల ఉన్నతాధికారులు దర్శించుకున్నారు. దేవస్థానానికి తైలాభిషేకాలు, ప్రత్యక్ష సేవల ద్వారా రూ.20,78,164, పరోక్ష, ఆన్‌లైన్ సేవల ద్వారా రూ.6,02,500 ఆదాయం వచ్చినట్టు దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, దేవస్థానం ఈఓ సింగం రాధ తెలిపారు. వానపల్లి పీహెచ్‌సీల సిబ్బంది వైద్య శిబిరం నిర్వహించారు. రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్ ఆధ్వర్యంలో ఎస్సై వి.మణికుమార్ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.



మందపల్లి క్షేత్రంలో పూజలు చేస్తున్న భక్తులు

ప్రజలకు సుపరిపాలనే లక్ష్యం

- జిల్లా ఇన్‌చార్జి మంత్రి జోగి రమేష్
- ముమ్మిడివరంలో నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశం



ముమ్మిడివరం సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

ముమ్మిడివరం: రాష్ట్రంలో ప్రజలకు సుపరిపాలన అందించేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. శనివారం ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాలలో పార్టీ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం ఆదేశాల మేరకు నియోజకవర్గ అభివృద్ధి కమిటీ సమావేశాలకు నాంది పలికామని చెప్పారు. తొలిసారిగా ముమ్మిడివరం నుంచి కమిటీ సమావేశాలు ప్రారంభించామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి చమురు సంస్థల సామాజిక బాధ్యత నిధులను తీసుకొచ్చి సత్ఫలితాలను సాధించారన్నారు. గ్రామాలను ప్రగతి పథంలో నడిపించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక నిధులు కేటాయించి సహకరిస్తున్నారని తెలిపారు. ప్రజలకు పాలన చేరువ చేసేందుకు సచివాలయాలు, ఆర్‌బీకేల వ్యవస్థలను తీసుకొచ్చామన్నారు. సముద్ర తీరప్రాంతం నీటి ప్రవాహానికి కొట్టుకుపోకుండా ఉండేందుకు నియోజకవర్గానికి సీఎం రూ.70 కోట్లు మంజూరు చేశారన్నారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించేందుకు సీఎం బాటలు వేస్తున్నారన్నారు. ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మాట్లాడుతూ సొంత స్థలాలు ఉన్నవారికి ఇళ్లు నిర్మించుకొనే అవకాశం కల్పించాలని ఇన్‌చార్జి మంత్రిని కోరారు. పంట కాలువలో గుర్రపుడెక్క ఎప్పటికప్పుడు తొలగించాలని, అయినాపురం కాలువ శివారు భూములకు సకాలంలో సాగునీరు అందేలా నీటి ప్రవాహాన్ని పెంచాలని జలవనరుల అధికారుల కు ఎమ్మెల్యే తెలిపారు. గోగుల్లంక, మర్లపాలెం గోదావరి నదిపై వంతెనలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నియోజకవర్గంలో పలు సమస్యలను మంత్రి దృష్టికి ఆయన తీసుకొచ్చారు. కలెక్టర్ హిమాన్షు శుక్లా మాట్లాడుతూ రంగరాజు కోడు బ్రిడ్జి పనులు రూ.94 లక్షలతో, భైరవపాలెంలో రూ.15 కోట్లతో డ్రెడ్జింగ్ పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాల్లో పురోగతి సాధించామని తెలిపారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో 26 లేఅవుట్లలో 2,048 గృహాలు మంజూరు చేశారని, ఇందులో ఇప్పటికే 670 పూర్తయ్యాయన్నారు. ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, హితకారిణి సమాజం చైర్మన్ బాలమునికుమారి, అమలాపురం పురపాలక సంఘ చైర్ పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ టెక్నాలజీపై ముగిసిన శిక్షణ

రాయవరం: ప్రభుత్వ పాఠశాలలు డిజిటల్ టెక్నాలజీని అందిపుచ్చుకొనే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. డిజిటల్ విద్యను ప్రోత్సహించే క్రమంలో భాగంగా 1–5 తరగతులకు స్మార్ట్ టీవీలు, 6–10 తరగతులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ)ను సరఫరా చేయాలని నిర్ణయించింది. తొలి విడతగా నాడు–నేడులో అభివృద్ధి చేసిన 192 పాఠశాలలకు 264 స్మార్ట్ టీవీలు, 141 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు 951 ఐఎఫ్‌పీలను ఏర్పాటు చేస్తున్నారు. స్మార్ట్ టీవీలు, ఐఎఫ్‌పీ డిస్‌ప్లేలను వినియోగించుకుని బోధన చేసేందుకు అనుగుణంగా ఉపాధ్యాయులకు డిజిటల్ టెక్నాలజీపై జిల్లా విద్యాశాఖ శిక్షణ ఇచ్చింది. 1న ప్రారంభమైన శిక్షణ శనివారం సాయంత్రంతో ముగిసింది. జిల్లా పరిధిలోని 332 ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు ఐఎఫ్‌పీ, బైజూస్ ట్యాబ్స్, స్మార్ట్ టీవీల వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఉపాధ్యాయులను 109 బ్యాచ్‌లుగా విభజించి ఓడలరేవులోని బీవీసీ ఇంజినీరింగ్ కళాశాల, అమలాపురంలోని బీవీసీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్, రామచంద్రపురంలోని వీఎస్ఎం ఇంజినీరింగ్ కళాశాల, అగ్రహారంలోని కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలల్లో శిక్షణ శిబిరాలను నిర్వహించారు. వీటిని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి పర్యవేక్షించారు.



శిక్షణకు హాజరైన ఉపాధ్యాయులు

శృంగార వల్లభుని సన్నిధిలో భక్తుల కోలాహలం

పెద్దాపురం: తొలి తిరుపతిలోని స్వయంభూ శృంగార వల్లభస్వామి ఆలయం శనివారం భక్తులతో రద్దీగా మారింది. సుమారు 6 వేల మంది భక్తులు తరలివచ్చారు. టిక్కెట్లు, అన్నదానం, కేశఖండన ద్వారా స్వామి వారికి రూ.3,05,819 ఆదాయం సమకూరిందని ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చిన నూతన దంపతులకు, దాతలకు అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు ఆధ్వర్యాన వేద పండితులు శేషవస్త్రాలతో సత్కరించి స్వామి వారి చిత్రపటాలు అందజేశారు. భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం చేశామని ఈఓ తెలిపారు.



ప్రత్యేకాలంకరణలో శృంగార వల్లభ స్వామి

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- మృతదేహాన్ని తరలించేందుకు వచ్చిన 108
- దానిని ఢీకొన్న ఆర్టీసీ బస్సు
- మరో ముగ్గురికి గాయాలు



దెబ్బతిన్న 108 అంబులెన్స్

కొవ్వూరు: రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందగా, ఈ సమయంలో జరిగిన మరో ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. జాతీయ రహదారిపై కొవ్వూరు మండలం కాపవరం గ్రామ శివారు గోవర్ధనగిరిమెట్ట వద్ద శుక్రవారం రాత్రి 11 గంటలకు ఈ ప్రమాదం జరిగింది. ఇక్కడ ఓ వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ దుర్మరణం పాలైంది. మృతురాలి వయసు 40–45 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఈ మృతదేహాన్ని తరలించేందుకు హైవే పెట్రోలింగ్ సిబ్బంది 108 అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడకు అంబులెన్స్ రాగా, దానిని రోడ్డు పక్కన ఉంచి సిబ్బంది ఫోన్ మాట్లాడుతున్నారు. ఈ సమయంలో ఆర్టీసీ బస్సు వచ్చి ఆ అంబులెన్స్‌ను వెనుక నుంచి ఢీకొంది. అంబులెన్స్ పాక్షికంగా దెబ్బతింది. 108 డ్రైవర్ ఎలిపే రవికుమార్, టెక్నీషియన్ టి.సుబ్రహ్మణ్యంలు తీవ్రంగా గాయపడ్డారు. అక్కడే ఉన్న హైవే పెట్రోలింగ్ మొబైల్ డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఈ ప్రమాదాలపై కేసులు నమోదు చేశారు.

రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా

- రేంజ్ పరిధిలో 3,340 మంది
- కేటగిరీల వారీగా విభజన
- 3,340 షీట్ల సమగ్ర పరిశీలన
- ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: రౌడీషీటర్లపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. నేరాల తీవ్రత, రౌడీషీట్ ఉన్న వ్యక్తి నేరం చేస్తున్న తీరు, కేసుల సంఖ్య ఇలా కీలక అంశాలను ప్రామాణికంగా తీసుకుని రౌడీషీటర్లను కేటగిరీల వారీగా విభజించనున్నారు. ఏఎస్పీ, డీఎస్పీ, సీఐ, ఎస్సైలు స్వయంగా ప్రతి షీటర్ పరిస్థితిని పరిశీలించి సమాచారం తెప్పించుకుని ఎస్పీలకు నివేదించేలా పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఏలూరు రేంజ్ పరిధిలోని ఆరు పోలీస్ జిల్లాల్లో 3,340 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో 80 శాతం మందిపై 15 ఏళ్లుగా రౌడీషీట్ కొనసాగుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ముందస్తుగా రౌడీషీటర్లపై తీవ్ర నిఘా పెట్టేలా ఏలూరు రేంజ్ డీఐజీ జీవీవీ అశోక్‌కుమార్ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు.



ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న డీఐజీ అశోక్‌కుమార్, చిత్రంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

సమగ్ర దర్యాప్తు

రౌడీషీటర్లను ఆయా పోలీస్‌స్టేషన్లకు పిలిచి సత్ప్రవర్తనతో మెలగడం, గొడవల్లో జోక్యం చేసుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించి పంపిస్తున్నారు. డీఎస్పీలు, ఎస్పీలు కూడా కౌన్సెలింగ్‌లు ఇస్తున్నారు. అలాగే బైండోవర్ కేసులు నమోదు చేస్తున్నారు. ఇదంతా 15 ఏళ్లుగా పోలీస్ శాఖలో రొటీన్‌గా జరుగుతున్న తంతు. రౌడీషీటర్ల నేరాల సంఖ్య, పెండింగ్ కేసులు, ప్రాసిక్యూషన్, రౌడీషీటర్‌కు ఎవరి అండ ఉందనే అంశాలపై సమగ్ర దర్యాప్తు లేదు. ఈ పరిణామాల క్రమంలో నేరాల తీవ్రత కేసుల సంఖ్యకు అనుగుణంగా ఏ, బీ, సీ కేటగిరీలుగా రౌడీషీటర్లను విభజించి చర్యలు తీసుకోనున్నారు. ఇది ఏలూరు రేంజ్‌లో జరుగుతున్న కార్యాచరణ. ఎస్పీలే స్వయంగా ప్రతి షీట్‌ను పరిశీలించి స్థానిక పరిస్థితులు, అధికారుల అభిప్రాయాలకు అనుగుణంగా నిర్ణయం తీసుకోవాలని, అలాగే అవసరమైతే మరికొందరిపై కొత్తగా రౌడీషీట్‌ను తెరవాలని డీఐజీ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు.

ఆరు జిల్లాల్లో విభజన ప్రక్రియ

రేంజ్ పరిధిలోని కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు జిల్లాల పరిధిలో 3,340 మంది రౌడీషీటర్లు ఉన్నారు. వీరిలో వైట్‌కాలర్ నేరస్తులు మొదలు కిరాతక హత్యలు చేసిన వారు అందరిపై రౌడీషీట్లు ఉన్నాయి. ప్రమాదకరమైన రౌడీల ప్రమేయం ఉన్న కేసులను పోలీసులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. పెండింగ్ కేసుల్లో ట్రయిల్ వేగంగా పూర్తిచేసి శిక్షలు పడేలా చర్యలు తీసుకున్నారు. ప్రతి జిల్లాలో ఎస్పీ నేతృత్వంలో ఏఎస్పీ, డీఎస్పీలు క్రైమ్ రికార్డులను పరిశీలించడంతో పాటు గత పదేళ్లుగా రౌడీషీటర్ స్థితిగతులు, నేరప్రవృతి, తెరచాటు వ్యవహారాలు ఇలా అన్నికోణాల్లో పరిశీలించి నివేదికలు ఇస్తే ఎస్పీ తుది నిర్ణయం తీసుకుంటారు. రౌడీషీటర్ సత్ప్రవర్తనతో ఉంటే దానికి అనుగుణంగా చర్యలు ఉంటాయి. అలాగే పోక్సో కేసులు, హింసాత్మక ఘటనలకు పాల్పడేవారు, హత్యలు, తరచూ వివాదాలు, దొమ్మిలు చేస్తున్నవారిని గుర్తించి కొత్తగా రౌడీషీట్ తెరవాలని నిర్ణయించారు. ఏ కేటగిరీలో ఏ ప్లస్ రౌడీషీటర్లు, కీలక కేసుల్లో ఉన్న వ్యక్తులు, బీ కేటగిరీలో కేసుల సంఖ్య ఎక్కువగా ఉన్న వ్యక్తులు, సీ కేటగిరీలో వివాదాలు, గొడవలు, పంచాయితీలు చేస్తున్న రౌడీషీటర్లు ఉండేలా జాబితాలు సిద్ధం చేస్తున్నారు.

జిల్లా	రౌడీషీటర్లు
కృష్ణా	741
పశ్చిమ గోదావరి	340
ఏలూరు	592
తూర్పు గోదావరి	729
బీఆర్ అంబేడ్కర్ కోనసీమ	385
కాకినాడ	553

గంజాయి రవాణాపై నిఘా

ఏలూరు టౌన్: ఏలూరు రేంజ్ పరిధిలోని జిల్లాలో గంజాయి రవాణా, విక్రయాలపై పటిష్ట నిఘా ఏర్పాటు చేశామని డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు. ఏలూరు వన్‌టౌన్ స్టేషన్‌ను ఎస్పీ డీ.మేరీ ప్రశాంతితో కలిసి ఆయన శనివారం ఆయన ఆకస్మిక తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ రేంజ్‌లో గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు కఠిన వైఖరి అవలంబిస్తామన్నారు. సీఎం జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా గంజాయి రవాణాను అరికట్టేందుకు పటిష్ట కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. రేంజ్‌లో నాలుగేళ్లలో 910 గంజాయి కేసులు నమోదు చేసి, రెండు వేల మందికి పైగా నిందితులను అరెస్టు చేశామన్నారు. 85 వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని 15 మందిపై పీడీ యాక్టులు నమోదు చేయగా, మరో 605 మందిపై సస్పెక్ట్ షీట్ తెరిచామని చెప్పారు. గంజాయి, మత్తుపదార్థాల రవాణా, విక్రయాల సమాచారం అందించేలా ప్రభుత్వం 14500 టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటుచేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ నిర్ణయం మేరకు నేరాలు చేసేందుకు భయపడేలా చర్యలు ఉంటాయని డీఐజీ అశోక్‌కుమార్ తెలిపారు.

నెలలో వివరాలందించేలా..

ఆరు పోలీస్ జిల్లాల్లో రౌడీషీటర్ల కేటగిరీ విభజనకు సమగ్ర పరిశీలన క్షుణ్ణంగా జరుగుతుంది. నెల రోజుల వ్యవధిలో ప్రక్రియను పూర్తిచేసి అన్ని జిల్లాల నుంచి వివరాలు తీసుకుంటాం. రౌడీషీటర్లపై ఉన్న పెండింగ్ కేసులు వేగంగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తప్పవు.

– జీవీవీ అశోక్‌కుమార్, డీఐజీ

చేతికందకుండా..



ఆలమూరులో ఏడు అడుగుల మేర పెరిగిన కంద మొక్క

ఆలమూరు: కంద మొక్క సాధారణంగా మూడు నుంచి మూడున్నర అడుగుల మాత్రమే పెరుగుతోంది. కానీ ఆలమూరులోని మాజీ సర్పంచ్ దువ్వాసి సుబ్బారావు ఇంటి పెరట్లో పెంచిన కంద మొక్క ఏడు అడుగులు పెరిగి అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. ఈ కంద మొక్కకు ఏవిధమైన రసాయన ఎరువులు వాడకుండా కేవలం పశువుల పెంటను వేశానని యజమాని సుబ్బారావు చెబుతున్నారు. దీని దిగుబడీ ఆశాజనకంగా ఉంటుందని భావిస్తున్నానని అన్నారు. దీనిపై ఉద్యాన శాఖ అధికారి జి.కోటేశ్వరరావును వివరణ కోరగా భూమిలో పోషకాలు అత్యధికంగా ఉండడం, నీడలో మొక్క పెరగడం కానీ, జన్యుపరమైన పరివర్తనలో మొక్క పెరుగుదలకు కారణమని అన్నారు.

జనాభా నియంత్రణలో భాగస్వాములవ్వండి

జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు



సమావేశంలో లక్కీ డ్రా తీస్తున్న డీఆర్వో సత్తిబాబు

అమలాపురం రూరల్: జిల్లాలో కుటుంబ నియంత్రణకు అర్హత ఉన్న దంపతులు శస్త్ర చికిత్సలు నిర్వహించుకుని జనాభా నియంత్రణలో భాగస్వాములు కావాలని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవం–2023 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ కోసం స్త్రీలు ట్యూబెక్టమీ, పురుషులు వేసక్టమీ శస్త్రచికిత్సలు చేయించుకోవాలన్నారు. పీఐయుసీడీ విధానంపై మహిళలకు అవగాహన కల్పించి అవలంబింపజేయడంతో జిల్లాలోనే ప్రథమ స్థానంలో రామచంద్రపురం ప్రాంతీయ ఆసుపత్రికి చెందిన డాక్టర్ బి.వీరభద్రుడు, ద్వితీయ స్థానంలో స్థానిక ప్రాంతీయ ఆసుపత్రి వైద్యురాలు మౌనిక నిలిచారన్నారు. వారికి ప్రోత్సాహకంగా ఎన్‌హెచ్‌ఎం నిధుల నుంచి రూ.7 వేలు రూ.5 వేలు అందించామని చెప్పారు. పీఐయుసీడీ కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించిన వారి జాబితాలో లక్కీ డ్రా తీయగా అమలాపురం మండలం జనుపల్లికి చెందిన సి.అలేఖ్య, రామచంద్రపురం మండలం ముచ్చుమిల్లికి చెందిన లంక లక్ష్మి ఎంపికయ్యారు. వారికి ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావు దొర తదితరులు పాల్గొన్నారు.

మాణిక్యాంబా.. మనసా స్మరామి





ద్రాక్షారామ ప్రధాన రహదారిపై శోభాయాత్ర. అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న మంత్రులు కొట్టు సత్యనారాయణ, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ

- తొలిసారిగా శాకంబరిగా అమ్మవారు
- సారె సమర్పించిన మంత్రులు సత్యనారాయణ, వేణు

రామచంద్రపురం రూరల్: దక్షిణ కాశీగా, అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా అలరారుతున్న ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబా అమ్మవారిని చరిత్రలో తొలిసారిగా శాకంబరిగా అలంకరించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, వరలక్ష్మి దంపతులతో కలసి రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు చీర, సారె సమర్పించారు. ముందుగా కేరళ నృత్యాలు, కోలాటం, మంగళ వాయిద్యాలతో దక్షగుండం నుంచి ఆలయం వరకూ శోభాయాత్ర నిర్వహించారు. మంత్రులు శిరస్సున అమ్మవారికి సమర్పించే నూతన వస్త్రాలు పెట్టుకుని ముందుకు సాగారు. సుమారు 2 వేల మంది మహిళా భక్తులు యాత్రలో పాల్గొన్నారు. ఆలయం వద్ద ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో మంత్రులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి మహిళలు స్వీట్లు, పండ్లు సమర్పించారు. అమ్మవారు, స్వామివార్లను మంత్రులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మంత్రులకు అన్నవరం దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ ఆజాద్, ఆర్జేసీ సురేష్‌బాబు, డీసీ విజయరాజు, డీఈఓ సత్యనారాయణ, ఈఓ తారకేశ్వరరావు స్వామివారి జ్ఞాపికలను అందజేశారు. సర్పంచ్ కొత్తపల్లి అరుణ, ఎంపీటీసీ నున్న సత్యవతి, జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీలు అంబటి భవాని, పంపన నాగమణి, వైస్ ఎంపీపీ శాకా బాబీ, సర్పంచులు అంబటి తుకారం, పెమ్మిరెడ్డి దొరబాబు, అనిశెట్టి రామకృష్ణ, యళ్లమిల్లి సతీష్‌కుమారి, ఏపీబీడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, ఏపీఈడబ్ల్యూడీసీ డైరెక్టర్ టేకుమూడి సుజాత, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి టేకుమూడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



శాకంబరీ దేవి అవతారంలో ద్రాక్షారామ మాణిక్యాంబా అమ్మవారు